

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## పరిశుద్ధమైన నీటి సరఫరాకు నిరంతర పర్యవేక్షణ చేయండి : కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,డిసెంబర్ 29,ప్రభాతవార్త :** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల ద్వారా అందిస్తున్న మంచినీటి సరఫరా పరిశుద్ధంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. సంగం మండలం మహమ్మదాపురంలోని మంచినీటి శుద్ధి కేంద్రాన్ని అధికారులతో కలిసి కమిషనర్ ఆదివారం పరిశీలించారు. పెన్నానది నుంచి నీటిని సేకరిస్తున్న కేంద్రంలోని 122 ఎమ్.ఎల్.డి సామర్ధం గల ఇన్ టేక్ వెల్ ను పరిశీలించిన కమిషనర్ వివిధ విభాగాల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి శుద్ధత ప్రమాణాలను వంద శాతం పాటించాలని, నగరానికి మంచినీటి సరఫరాలో ఏలాంటి అంతరాయం కలుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటిశుద్ధతకు అవసరమైన క్లోరినైజేషన్, ఇతర పద్ధతులను క్రమం తప్పకుండా పాటించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ. శేషగిరిరావు పాల్గొన్నారు.

## కుడి కాలువ గేటు మరమ్మత్తులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**లింగసముద్రం, డిసెంబర్ 29, ప్రభాతవార్త** రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ గేటు మరమ్మత్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రాజెక్టు అధికారులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఆయన రాళ్లపాడు ప్రాజెక్టు సందర్శించి కుడి కాలువ గేటు మరమ్మత్తు పనులను పరిశీలించారు. కుడి కాలువ గేటు మరమ్మత్తులకు సంబంధించిన పలు అంశాలు ఆయన ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రాళ్లపాడు కుడి కాలువ గేటు రెండు అడుగులకు పైగా లేచి ఉందని, పూర్తి స్థాయిలో దీనికి మరమ్మత్తులు చేయడం జరుగుతుందని ఇంజనీరింగ్ బాధ్యులు తెలిపారు. నీరు యధావిధిగా రైతులకు అందిస్తామని అధికారులు ఎమ్మెల్యేకి వివరించాఉ. నీటి సరఫరా విషయమై ఎమ్మెల్యే రైతులతో మాట్లాడారు. రైతులకు పరిపూర్ణంగా నీటిని సరఫరా చేయడంలో రాజీ పడబోమని ఎమ్మెల్యే చెప్పారు. రాళ్లపాడుకు సంబంధించిన మిగతా గేట్లకు కూడా సర్వీసింగ్ త్వరితగతిన చేయాలని ఎమ్మెల్యే ప్రాజెక్టు ఇంజనీర్లకు సూచించారు.

## వన్ మాన్ కమిషన్ రిటైర్డ్ రాజీవ్

### రంజాన్ మిశ్రా జిల్లా పర్యటన



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 29, ప్రభాతవార్త** షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కొరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వన్ మాన్ కమిషన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రా జనవరి 3, 4 తేదీలలో జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ తెలిపారు. వచ్చే నెల 3వ తేది సాయంత్రం వైయస్సార్ కడప జిల్లా నుండి రోడ్డు మార్గం ద్వారా సాయంత్రం 6:30కు నెల్లూరు చేరుకుని బస చేస్తారు. 4వ తేది ఉదయం 10:30 నుండి 2:00 వరకు జిల్లా యంత్రాంగంతో సమావేశ మవుతారన్నారు. అనంతరం ఆయన వ్యక్తుల నుండి, సంస్థలు, కుల సంఘాల ప్రతినిధులు, అసోసియేషన్ల నుండి విజ్ఞాపనలు, వినతి పత్రాలు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని రాత్రి బస చేస్తారు. 5 వ తేది ఉదయం ఒంగోలు బయలుదేరి వెళ్తారు.

## రాళ్లపాడులో ఘర్షణ : పలువురికి గాయాలు



**లింగసముద్రం, డిసెంబర్ 29, ప్రభాతవార్త** గ్రామంలో వివాదస్ప ద స్థల వివాదంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగి పలువురికి గాయాలైన సంఘటన రాళ్లపాడు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పెంట్రాల పంచాయతీ పరిధిలోని రాళ్లపాడు గ్రామంలో గత కొన్ని రోజులుగా స్థల వివాదం జరుగుతుంది. ఆదివారం టీడీపీ పార్టీకి చెందిన కొందరు ఆ స్థలాన్ని ట్రాక్టర్‌తో దున్నడంతో గ్రామంలోని మరో వైసీపీ సానుభూతిపరులు ఆ స్థలానికి ఎందుకు దున్నారని అడిగారు. దీంతో రాత్రి 8గంటల ప్రాంతంలో రెండు వర్గాలు కర్రలు, రాళ్లతో కొట్టుకు న్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘర్షణలో వైసీపీ సానుభూతి పరులు ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు ఒకరికి గాయాలయ్యాయి. గాయాలైన వారిని కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించి



చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామంలోకి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తూ పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

## ఏంటయ్యా హాస్టల్ ఇలాగేనే ఉంచేది

### వార్డన్‌ని ప్రశ్నించిన సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి



**బుచ్చి డిసెంబర్ 29 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం ఎస్సి బాలుర హాస్టల్‌ని సోషల్ వెల్ఫేర్ డిడి కె. శోభారాణి ఆకస్మికంగా పరిశీలించారు. హాస్టల్ వంటగదులు, బాత్‌రూంలు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ట్యాప్‌లు లేని కుళాయిలు వెంటనే సాయింత్రం కల్లా బాగు చేయించాలని వార్డన్ సునీల్‌కి సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతు బుచ్చిరెడ్డిపాళెం ఎస్సి బాలుర హాస్టల్ మరమ్మత్తులకు 22 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులపైన ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆమె తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులు 430 మంది ఉన్నట్లు ఆమె తెలిపారు. పదోతరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు కండక్టె చేసి ఉత్త ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సి హాస్టల్స్ రిపేర్‌కి నిధులు మంజూరు కావడం జరిగిందని, పంచాయితీరాజ్,ఆర్‌డబ్ల్యూస్ అధికారులతో మాట్లాడడం జరిగిందని ఆమె తెలిపారు. అలాగే బడ్జెట్ కూడా రావడం జరిగిందని అన్నారు. పంపిణి కూడా చేయడం జరిగిందని ఆమె చెప్పారు. అనంతరం ఎస్సి బాలికల హాస్టల్స్ రెండింటిని తనీఖి చేశారు. అక్కడ పరిస్థితులు పరిసరాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

## కండలేరులో 57.228 టీయంసీల నిటిమట్టం



**కండలేరుడ్యాం (రాపూరు), డిసెంబరు 29 ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో ఆదివారం ఉదయానికి 57.228 టీయంసీల నిటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో సోమశిల.కండలేరు వరద కాలువ ద్వారా 1100 క్యూసెక్కులు,వరదనీటి రూపేణా 210 క్యూసెక్కుల చోప్పున మొత్తం 1310 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా జళాశయంలోకి వస్తుండగా అవుట్‌ఫ్లోగా జళాశయం హెడ్ రెగ్యులేటర్ నుండి 595 క్యూసెక్కులు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 10 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 110 క్యూసెక్కుల చోప్పున మొత్తం 715 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

# విద్యుత్‌పై రూ.1లక్ష29వేల కోట్ల అప్పు

- స్మార్ట్ మీటర్ల బిగింపుకు ఆద్యుడు జగనే
- 9 సార్లు కరెంటు ఛార్జీలు పెంపు
- రూ.1750 కోట్ల లంచం తీసుకున్నాడు.. లక్ష కోట్లు భారం మోపాడు
- అవినీతిలో ఆరితేరిన జగన్



**నెల్లూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త-వైద్యం** 29వేల కోట్ల జగన్ విద్యుత్ సంస్థపై రూ.1లక్ష 29 వేల కోట్లు అప్పు చేశాడని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు మాజీ మంత్రి మాజీ శాసనమండలి సభ్యుడు సరేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని టీడీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై రూ.32వేల కోట్ల భారాన్ని మోపాడని ఆరోపించాడు. 2014లో చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టేనాటికి 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఉందని, దానిని 2019లో చంద్రబాబునాయుడు అధికారం కోల్పోయే నాటికి లోటును అధిగమించి సర్‌ప్లస్‌కు తెచ్చాడని తెలియజేశాడు. 7వేల మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను యూనిట్ రూ.2.49 కొనుగోలు చేసేలా సెకితో ఒప్పందం చేసుకుని, అదే సమయంలో గుజరాత్ రూ.1.99కే కొనుగోలు చేసేలా ఒప్పందం రాసి వెళ్లాడని సోమిరెడ్డి ధ్వజమెత్తారు. జగన్‌రెడ్డి బరితెగించి రూ.1750 కోట్లు లంచం తీసుకున్న పాపానికి ప్రజలపై అదనంగా లక్ష కోట్ల భారం మోపడం దారుణం అన్నాడు. ఏపీ సీఎంగా జగన్‌రెడ్డి లంచం తీసుకున్నాడని అమెరికాకు చెందిన అంతర్జాతీయ దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ చెప్పి నెల కాలేదని, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను 30 ఏళ్ల గడువుకు తాకట్టుపెట్టి, ఇప్పుడు నిరసనల పేరుతో రోడ్డెక్కడానికి సిగ్గుండాలని చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డాడు. కేబినెట్ అప్రూవల్ లేకుండానే ఒప్పందాలు చేసి ప్రజలపై మోయలేని భారం మోపాడని వివరించాడు. జగన్ మోస్ట్ నెటోరియస్ కరప్టెడ్ లీడర్‌గా అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడని ఆయన పేర్కొన్నారు. ఒక్క పవర్ ప్లాంటు నిర్మించకుండానే విద్యుత్ సంస్థల పేరుతో రూ.49 వేల కోట్లు అప్పులు చేశాడని, జగన్ చుట్టూ నలుగురైదుగురు రెడ్లకు ఆదాయమే లక్ష్యంగా దోపిడి జరిగిందన్నారు. కృష్ణపట్నంలోని ఏపీ జెన్‌కో థర్మల్ పవర్ ప్లాంటుకు రూ.281 కోట్ల విలువైన 4.50 లక్షల టన్నుల నాసిరకమైన బొగ్గును సరఫరా చేసి దోచుకున్నారన్నారు. మట్టిమషానంతో కూడిన ఆ బొగ్గుతో ప్రాజెక్టు ఉనికికే ప్రమాదమని జెన్‌కో ఉద్యోగులు తిరగబడిన పరిస్థితి తీసుకొచ్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. జగన్ అవినీతి దెబ్బకు అమెరికాలోని ఎఫ్‌బీఐ నుంచి నేలటూరులోని జెన్‌కో ఉద్యోగుల వరకు రోడ్డెక్కారని, అయినా సిగ్గుశరం లేకుండా నిరసనల పేరుతో ఊరేగింపులు చేసుకున్నారని సోమిరెడ్డి విమర్శించారు. స్మార్ట్ మీటర్ల విషయంలోనూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేకుండా ఏపీలో పెట్టేందుకు అనుమతిచ్చిన మహానుభావుడు కూడా జగన్ అని, ఒక్కో స్మార్ట్ మీటర్‌కు రాజస్థాన్‌లో రూ.7943, ఛండీగర్‌లో రూ.9710 ఖర్చు చేస్తే ఏపీలో మాత్రం రూ.36975 అంట జగన్‌మోహన్‌రెడ్డి లాంటి వ్యక్తిని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నందుకు ఏపీ ప్రజలు జీవితకాలం బాధపడే పరిస్థితి తెచ్చిపెట్టారని చెప్పాడు. ఇంత బరితెగించి దోపిడికి పాల్పడిన ముఖ్యమంత్రి దేశ చరిత్రలోనే లేడన్నాడు. ధనదాహంతో ఏపీలో ఐదేళ్ల పాటు వ్యవస్థలన్నింటిని నాశనం చేసేశారు. ఇలాంటి వ్యక్తులా విద్యుత్ భారం పేరుతో ధర్నాలు, ప్రదర్శనలు చేసేదని ఆయన ప్రశ్నించాడు. విద్యుత్ రంగాన్ని ఎలా పునరుద్ధరించాలో తెలియక కూటమి ప్రభుత్వం తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విద్యుత్ పేరు ఎత్తే అర్హతే వైసీపీ నాయకులకు లేదు. ప్రజలపై భారం ఎలా తగ్గించాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారు.

## రైతుల్ని మోసం చేసిన కూటమి ప్రభుత్వం : మాజీ మంత్రి కాకాణి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 29, ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు సూపర్ సిక్స్ పేరుతో అబద్ధపు హామీలు ఇచ్చిందని ఇచ్చిన హామీలను ఈ ఒక్క హామీ నెరవేర్చిన పాపాల పోలేదని వైఎస్ఆర్సిపి మాజీ మంత్రి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీల్లో భాగంగా రైతులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఆయన తెలిపారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కూటమి ప్రభుత్వం రైతుని నమ్మించి మోసం చేసిందని తెలిపారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చకుండా రైతుల్ని అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. వ్యవసాయాన్ని సంక్షోభంలోకి దింపేశారని చెప్పారు. ఒకపక్క వరదలు వర్షాలు మరోవైపు కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయానికి నిరంతక అన్నదాత అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని తెలిపారు. సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీలను రైతన్న పెట్టుబడి హామీ నెరవేర్చిన పాపాన ఈ ప్రభుత్వం పోలేదని తెలిపారు. పండించుకున్న ధాన్యానికి గిట్టుబాటు ధర ఇప్పించే పరిస్థితిలో కూడా ఈ ప్రభుత్వం లేదన్నారు. అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి వచ్చారని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం లెక్కల ప్రకారం 95 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు అధికారకంగా తెలిపారు అయితే అనధికారికంగా 150 పైచిలుకు అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది అన్నారు. గత ప్రభుత్వంలో అన్ని విధాల వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నదాతలను ఆదుకున్నారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక అన్ని విధాల అన్నదాతలు అప్పులు ఊబిలో కూరుకు పోతున్నారని తెలిపారు. ఇకనైనా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

## లక్షలతో నిర్మించారు.. నిరుపయోగంగా వదిలేశారు




### నిరుపయోగంగా పడి వున్న మాతా శిశు సంరక్షణ కేంద్రం

**కోవూరు, డిసెంబరు 29 ప్రభాతవార్త :** మాతా శిశు సరంక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొంటామంటూ గతంలో ప్రభుత్వం లక్షలాది రూపాయలు వ్యయం చేసి మాతా సంరక్షణ శిశు కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. ఈ భవనంలో వైద్యశాలకు అవసరమైన రూములు, వార్డు కూడా ఏర్పాటు చేశారు. అయితే దీనికి తగ్గటుగా కావాల్సిన ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో ఎంతో మంచి ఉద్దేశ్యంతో ఏర్పాటుచేసిన ఈ కేంద్రం ప్రస్తుతం మూత పడి ఉంది. ఈ దుస్థితి ఎక్కడోమారుమూల ప్రాంతంలో దేశంలోనే పొదుపు ఉద్యమానికి ఊపిరి పోసిన లేగుంటపాడు గ్రామంలో నెలకొంది. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 12 లక్షలు వ్యయం చేసి మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఈప్రాంతంలో ఏర్పాటుచేశారు. కేవలం కొద్ది రోజులు మాత్రమే ఈ కేంద్రం ద్వారా ప్రజలు సేవలు అందించిన ఆ కేంద్రం ఆ దిశగా ముందుకు సాగుతున్న దాఖలాలు లేవు. ఫలితంగా అప్పటి నుంచి ఈ కేంద్రం ఎటువంటి సేవలు అందించలేక మూతపడి ఉంది. దీనిపై సంబంధిత శాఖాధికారులు కూడా ఆశించిన మేర దృష్టిసారించకపోవడంతో మంచి లక్ష్యంతో ఏర్పాటుచేసిన ఈ కేంద్రం ఆ దిశగా అడుగులు వేయలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవ తీసుకొని ఈకేంద్రాన్ని దీనికి కావాల్సిన వైద్యులు, సిబ్బందిని ఏర్పాటుచేసి వినియోగంలోకి తెస్తే ఈకేంద్రం పరిధిలో ఉన్న వేగూరు,మోడేగుంట, జమ్మిపాళెం, వేగూరు కండ్రిగ ప్రాంత ప్రజలకు ఈ కేంద్రం ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు వీలు ఉంటుంది. ఈ కేంద్రంలో కొద్ది రోజులు ప్రకృతి వైద్యశాల ఏర్పాటుచేసి సేవలు కూడా కొద్ది రోజులు అందించారు. ప్రస్తుతం ఈ కేంద్రాన్ని ఆరోగ్య ఉపకేంద్రంగా ఉపయోగంలోకి తెస్తున్న ఆశించినమేర అవి ప్రజలకు సేవలు అందించలేకున్నాయి. ప్రస్తుత గ్రామీణ ప్రాంతాల్లో గత ప్రభుత్వం హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం లేగుంటపాడు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఈ మాతా శిశుసంరక్షణ కేంద్రంలో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసేలా సంబంధిత శాఖ అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. తద్వారా ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు ఇంటి ముంగిటికే అందించే అవకాశం ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.



**అంబులెన్స్ నిరుపయోగం:** అప్పట్లో రాజ్యసభ సభ్యులు దాసరి నాగభూషణం రాజ్యసభ నిధులు నుంచి రూ.5 లక్షలు వెచ్చించి ఈ ప్రాంత ప్రజానీకానికి ఈ కేంద్రానికి ఒక అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటుచేశారు. కొద్దిరోజులు మాత్రం ఈ అంబులెన్స్ ఈ ప్రాంత వాసులకు సేవలు అందించిన అనంతరం ఎటువంటి సేవలు అందించక మరమ్మత్తులకు గురై మూల పడి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ కేంద్రంపై దృష్టిసారించి దానిని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## చౌదరి బ్రదర్స్ ఆతిథ్యం బాగుంది : సినీహీరోయిన్, అనసూయ





**కోవూరు డిసెంబర్ 29 ప్రభాతవార్త** సినీహీరోయిన్, అనసూయ భరద్వాజా కుటుంబ సమేతంగా చెన్నైకి వెళుతూ మార్గ మధ్యంలో ఆదివారం రాత్రి కోవూరులోని జాతీయ రహదారిలో ఉన్న ఆర్కె రెస్టారెంట్‌లో డిన్నర్ కోసం కాసేపు ఆగారు.ఈ సందర్భంగా వారికి రెస్టారెంట్ అధినేత రవికుమార్ చౌదరి ప్రత్యేకంగా ఆతిథ్యం అందించారు. రెస్టారెంట్‌లో ఉన్న అన్ని వెజ్ నాన్ వెజ్ వంటకాలను తిని అనసూయ భరద్వాజ కుటుంబం సంతృప్తి వ్యక్తం చేశారు. వంటలు చాలా బాగున్నాయని కితాబు ఇచ్చారు. అనసూయ భరద్వాజ్‌తో పోటోలు సెల్ఫీలు తీసుకునేందుకు పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న సిబ్బంది ఉద్యోగస్తులు క్యూ కట్టారు. అందరితో ఓపిగా అనసూయ భరద్వాజా పోటీలు సెల్ఫీలు దిగారు.

## మరలా ఘాటెక్కిన కూరగాయలు



**కోవూరు, డిసెంబరు29 ప్రభాతవార్త : జిల్లాలో** ఇటీవల కాలం వరకు తగ్గుముఖంలో ఉన్న కూరగాయల ధరలు మరలా ఆకాశాన్నంటాయి. గతంలో 200 రూపాయలు వరకు ధర పలికిన టొమాటో కిలో ధర ప్రస్తుతం ఇటీవల కాలంలో తగ్గి మరలా కిలో 25నుంచి 30 రూపాయల వరకు పెరిగింది. వీటితో పాటు తగ్గుముఖంలో ఉన్న పచ్చిమిర్చి, బీనిస్, క్యారెట్ ధరలు కూడా విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం పచ్చడి మెతుకులు తిందామన్నా కిలో పచ్చి మిరపకాయలు 40 రూపాయలు ఉండడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల కాలం వరకు బీన్స్, క్యారెట్, బీట్‌రూట్, బెండకాయలు, వంకాయలు, దొండకాయలు సామాన్య మధ్య తరగతి కుటుంబాలకు వాటి ధరలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వంకాయ కూర చేయాలంటే కిలో 100 నుంచి 120 వరకు ఉంది. తాళింపు చేస్తామన్నా బీన్స్ ధరలు100 రూపాయలకు పెరిగి ఆకాశాన్నంటుతున్నాయి. అల్లం ధర సైతం కిలో 100 రూపాయలకు ఎగబాకింది. ఇటీవల కాలం వరకు 15 రూపాయలకు కిలో దొరికే బెండకాయలు, దొండకాయలు ప్రస్తుతం వాటి ధర కిలో 60 రూపాయలకు చేరుకుంది. దీంతో సామాన్య మానవుడి పరిస్థితి గంధరగోళంగా మారింది.

**ఘాటెక్కిన ఉల్లి** మార్కెట్‌లో ఇటీవల కాలం వరకు రూ. 100కు 6నుంచి 7 కిలోలు ఇచ్చిన ఉల్లి ధరలు ప్రస్తుతం మరింత ఘాటెక్కాయి. మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ.50 నుంచి 60 పలుకుతుంది. ప్రస్తుతం ఏ కూర చేయాలన్నా ఉల్లి , టొమాటో తప్పనిసరి కావడంతో సామాన్య ప్రజానీకం బెంబేలెత్తుతున్నారు. రానున్న రోజుల్లో ఉల్లి ర కిలో రూ. 100కు పోయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ధరలను అదుపు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఇందిరాకాలనీ లో వసతులు కల్పించండి



**బిట్రగుంట డిసెంబర్ 29 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాధ రావు పేట పంచాయతీ ఇందిరా కాలనీలో వసతులు కల్పించాలని కాలనీ వాసులు విజ్ఞప్తిచేస్తున్నారు. స్వర్గీయ ఇందిరాగాంధీ ప్రధానమంత్రి గా ఉన్నప్పుడు కట్టించిన ఇందిరా కాలనీలో సరైన రోడ్లు, డ్రైనేజీ కాలవలు లేవు వాటర్ పైప్ లైన్ లేదు. కావున పాలకులు దృష్టిసరించి కనీస సదుపాయలు కల్పించాలని కోరుతున్నారు..

## రక్తదాన శిబిరం ఏర్పాటు



**ఇందుకూరుపేట, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** యువనేత దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి(డీకేఆర్) ముందస్తు జన్మదిన వేడుకల్లో భాగంగా నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం పల్లెపాలెం గ్రామంలోని ప్రాధమిక పాఠశాల నందు నెల్లూరు రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ చేత ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యక్రమ నిర్వాహకులు అప్పాని రమణయ్య, బెజవాడ సుధాకర్‌రెడ్డిలు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు వంద మంది ఈ శిబిరంలో పాల్గొని రక్తాన్ని ఇచ్చారని నిర్వాహకులు తెలిపారు. రక్తదానం చేసిన దాతలకు పండ్లు, గోడ గడియారం బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీకేఆర్ యువత, దేవిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, షేక్ ముజీర్, గున్నం కిషోర్, పొట్లూరి నరేంద్ర, ఒలిముడి శివకుమార్, సంకే సురేంద్ర, ఒలిముడి శ్రీకాంత్, షేక్ యుబాదుల్లా, ఆమారి సుధాకర్, గంపల సుబ్రహ్మణ్యం, ఊటుకూరు నాగరాజు, గుడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## బీటీపీ రాష్ట్ర నేత దార్ల నరసింహం మృతి బహుజనోద్యమానికి తీరని లోటు

**కందుకూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** అంబేద్కర్ వాది, బుద్దిస్ట్, బీటీపీ రాష్ట్ర నేత దార్ల నరసింహం అకాల మరణం బహుజనోద్యమానికి తీరని లోటని బీటీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ అన్నారు. ఆదివారం కందుకూరు శ్రీనగర్ కాలనీలో జరిగిన దార్ల నరసింహం సంస్మరణ సభలో చిట్టేటి రమేష్ పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు, బహుజనుల రాజ్యాంగ హక్కుల సాధన కోసం నరసింహం నిరంతరం శ్రమించారని చిట్టేటి రమేష్ కొనియాడారు. బహుజన కెరటాల వ్యవస్థాపకుడు పల్నాటి శ్రీరాములు మాట్లాడుతూ మహాత్మాజ్యోతిబాపూలే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాన్యశ్రీ కాన్షీరాం మార్గంలో బహుజన రాజ్యాధికారం కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో దార్ల నరసింహం చురుగ్గా పాల్గొనేవాడని, ప్రత్యామ్నాయ సంస్కృతిలో భాగంగా బౌద్ద ధర్మాన్ని ఆచరించిన ధన్యశీలని అన్నారు. దార్ల నరసింహం స్మృతిలో మిత్రులు ప్రచురించిన బౌద్ద ధర్మం పుస్తకాన్ని ప్రముఖ బుద్దిష్టు పుల్లయ్య బోది గాండ్ల హరి ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సభలో ఎంఈఓలు బండి గోవిందయ్య, మల్లిఖార్జునరావు, మాధవరావు, బీటీపీ నేతలు కళ్లగుంట మోహన్‌రావు, పర్రె వెంకటరావు, పల్లం వేణుగోపాల్, ఆదినారాయణ, మాల్యాద్రి, లక్ష్మయ్య, ప్రసాద్, మణి, సుబ్బు, ఏల్చూరి మాధవరావు, మద్దిరాల మాధవరావు, వలేటి మాలకొండయ్య, వెంకటరావు, మాల ఉద్యోగుల సంఘం నాయకులు అశోక్‌బాబు, శ్రీరాములు, యరమాల జనార్ధన్, దమ్ము థామస్, గోపి, స్థానిక నాయకులు బొట్లగుంట శ్రీనివాసులు, బాలకోటయ్య, అరుణ, సుభాషిణి, సుధాలక్ష్మీ, ఎంఆర్‌పీఎస్ నేతలు జలదంకి నరసింహారావు, దంతం రాజా తదితరులు పాల్గొని ఘన నివాళులర్పించారు.

## ముగ్గుల పోటీలు



**నెల్లూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త–వైద్యం :** శెట్టిగుంట రోడ్డులోని వెంగమాంబ దేవస్థానంలో ఆదివారం ఉదయం సృజన సాహితీ సాంస్కృతిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీకి విశేష స్పందన వ్యక్తమైంది. పరిసర ప్రాంతాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఎంతో ఉత్సాహంగా రంగు రంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. విజేతలకు విలువైన చీరలను, గిఫ్టులను పోటీదారులందరికి ఉచిత కానుకలను నిర్వాహకులు బహుకరించారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలు పార్లపల్లి నాగేశ్వరమ్మ, మన హాస్పిటల్ అధినేత డాక్టర్ మారం సుధాకర్, చెన్నై హాస్పిటల్స్ ఎస్‌వీ రమేష్‌బాబు, ఆయుర్వేద వైద్యులు కే.శ్యాంధన్ హరిత రెసిడెన్సీ అధినేత్రి పెనాకే సుజాతరెడ్డి, ఆలయ చైర్మన్ పచ్చా వెంకట సుబ్బయ్య, శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు వి.హర్షవర్ధని, సి.వెంగయ్య, ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్ టీచర్ ఎం.సంతోష్ కుమార్, రోటరీక్లబ్ ప్రెసిడెంట్ జి.శ్రీహరిలు ముఖ్య అతిధులుగా విచ్చేసి ప్రసంగించారు. ధూబిపెట్ట కళ్యాణి, రాధమ్మ ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రధమ బహుమతి రూ.2వేలు విలువ గల చీరను ఎం.మంజుల గెలుపొందారు. ద్వితీయ బహుమతి రూ.15వందల చీరను డి.మాధురికి, తృతీయ బహుమతి వెయ్యి రూపాయల చీర, ప్రోత్సాహక బహుమతులు ఒక్కక్కరికి రూ.600 వందల గిఫ్ట్ ధనలక్ష్మీ, వి.మాధురిలు సాధించారు. అలాగే పోటీదారులందరూ ఆకర్షణీయమైన కంటైనర్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి దేవస్థానం వారు భోజన వసతి ఏర్పాటు గావించారు.

## జయభారత్‌లో మైదాన ప్రాంత గిరిజనుల సదస్సు



**నెల్లూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త–వైద్యం :** నగరంలోని జయభారత్ హాస్పిటల్‌లో మైదానం ప్రాంత గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం మైదానం ప్రాంత గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్య సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, తెనాలి జిల్లాల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. ముఖ్యంగా 2026 లో వచ్చే డీలిమిటేషన్ కమిటీలో మైదానం ప్రాంతాల గిరినులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని అసెంబ్లీలో లోకసభలో రాజ్యసభలో, శాసనమండలిలో స్థానాలు కేటాయించాలని ఆ సమావేశంలో వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని గిరిజన సంఘాలు ఏకతాటిపై నిలబడి గిరిజనుల హక్కులు కాపాడుకోవాలని వక్తలు పేర్కొన్నారు. ఎస్సీలకు జిల్లా యూనిట్‌గా తీసుకోవడం, ఎస్టీలకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని గిరిజనులకు జరుగుతున్న మోసాన్ని ఎదిరించి పోరాడాలని తీర్మాణం ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈగ శ్రీనివాసరావు, తుపాకుల హరిప్రసాద్, మల్లవరపు రమణమ్మ, కేసీ పెంచలయ్య, చేవూరు సుబ్బారావు, పులి చెంచయ్య, దాసరి పోలయ్య, బాపట్ల వెంకటపతి, ముత్యం నరసింహులు, దీన దయాల్ చందమామల కోటయ్య, బొజ్జప్ప, వెతగిరిత సుధాకర్‌రావు, ఈగ రామయ్య, కుడుముల రామచంద్రయ్య, బాపట్ల శివకృష్ణ, పాలకుర్తి శ్రీనివాసులు, చచ్చాల ప్రసాద్, శరవణ జగన్నాథం, వైకుంఠం కొవరగిరి ప్రసన్న, కోమరగిరి ప్రసాద్, కొట్లపటి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. పొట్లూరి శ్రీనివాసులు, కన్వీనర్, మైదానం ప్రాంత గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం



**బిట్రగుంట డిసెంబర్ 29 ప్రభాతవార్త:** బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేట పంచాయితీలోని అక్షయ ఉమెన్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ నిర్వాహకులు గోవా బాలశైలజ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ గన్నవరం కు చెందిన డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని గ్రహణ మొర్రి ఉన్న వాళ్లకి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ శిబిరం లో పలు గ్రామాల నుండి వచ్చిన 20 మందికి పరీక్షలు నిర్వహించడం జరిగింది. పరీక్షలు చేసిన తర్వాత 5 మందినిఎంపిక చేశారు. ఎంపిక అయిన వారికి జనవరి 11వ తేదీ నుండి 20వ తేదీ లోపు డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరొకసారి పరీక్షలు నిర్వహించి తరువాత ఎవరికైతే ఆపరేషన్ కి అవసరము మరియు ఆపరేషన్ అవసరం లేని వాళ్ళకి ఫ్రీ మెడిసిన్ తో పాటు ఉచిత రవాణా సౌకర్యం వసతులు కల్పిస్తుందని ఫ్యూచర్ ఆఫ్ స్మైల్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండూరి మంజుల, టిడిపి మండల అధ్యక్షులు మాలె పాటి నాగేశ్వరరావు మరియు ఫ్యూచర్ ఆఫ్ స్మైల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## నృసింహుని సేవలో యూట్యూబర్ సీమరాజు



**పెంచలకోన(రాపూరు), డిసెంబరు29ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహా స్వామి వారిని ఆదివారం ప్రముఖ యూట్యూబ్ నటుడు సీమరాజు దర్శించుకున్నారు. కోనకు వచ్చిన సీమ రాజు శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహా స్వామి, శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారు, శ్రీ అంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు ఆయనకు ఆశీర్వచనాలు ఆందజేసి స్వామి వారి తీర్ధ ప్రసాదాలను ఆందజేశారు.

## భక్తులతో కిక్కిరిసిన పోతుకోండ అంకాళ పరమేశ్వరీ ఆలయం



**రాపూరు, డిసెంబరు29ప్రభాతవార్త:** భక్తుల కోంగు బంగారంగా వీరాజిళ్ళుతున్న వేపినాపి గ్రామ దేవత శ్రీ పోతుకోండ అంకమ్మ తల్లి ఆలయం పెద్ద ఎత్తున వచ్చిన భక్తులతో ఆదివారం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఉదయం నుండే ఆలయం వద్దకు చేరుకోని అమ్మ వారికి పోంగళ్ళు పెట్టుకోని మొక్కులు చెల్లించు కున్నారు. భక్తులకు అమ్మవారి తీర్ధ ప్రసాదాలను నిర్వహ కులు, అర్చక స్వాములు ఆందజేశారు.

## నగరంలో గుర్తు తెలియని వ్యక్తి హత్య

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే గుర్తు తెలియని వ్యక్తి (45) నగరంలో బిక్షాటన చేస్తూ స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఇంజనీరింగ్ కార్యాలయం సమీపంలో రాత్రిపూట నిద్రిస్తూ ఉంటాడు. ఇతను మరో గుర్తుతెలియని మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో సదరు వ్యక్తి తలపై తీవ్ర గాయాలతో మరణించి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న స్థానిక వీఆర్వో సందాని భాష ఫిర్యాదుతో సంతపేట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడి తోటే సహజీవనం చేస్తున్న మహిళ కనపడకపోవడంతో ఆమె ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటుందా లేక మరెవరైనా చేసి ఉంటారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## బలిజ భవన్ ద్వారా ఆర్థిక భరోసా, ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** బలిజ భవన్ భరోసా 5 వ విడత కార్యక్రమం ఆదివారము ఉదయం 10 గంటల కు బాలాజీ నగర్‌లోని బలిజ భవన్‌లో జరిగినది ఈ కార్యక్రమంలో 6 మంది నిరుపేద బలిజ కుటుంబాలకు అమృత కలశం పేరుతో (20కేజీల బియ్యం, ఫల సరుకులు) వస్తు రూపంలో సహాయం అందజేసారు. పొదలకూరు టౌన్ నివాసి అయిన తోట వెంకటయ్య గుండెకి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారని తెలుసుకుని ఆయనకి బలిజ భవన్ భరోసా కింద 6000 రూపాయలు ఆర్థిక భరోసా అందజేసినారు. అంతేకాకుండా బలిజ భవన్ భరోసా కింద ఈనెల నుంచి 5 మంది మహిళలకి ఉచితంగా కుట్టు తరగతులు ప్రారంభించడం జరిగింది. చాట్ల నరసింహారావు, తోట శోభారాణి చేతుల మీదుగా 5మంది కి కుట్టు సామాగ్రి అందించి తరగతులను ప్రారంభించారు. వీరికి మూడు నెలలు శిక్షణ ఇస్తారు. వీరికి శిక్షణ నిర్వాహకురాలుగా వరద నాగరాజమ్మచే శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తి అయిన తరువాత వారికి ఉచితంగా కుట్టు మిషన్లు బలిజ భవన్ భరోసా కింద అందజస్తారు. ఈ కార్యక్రమంలో బలిజ భవన్ కార్య నిర్వాహకులు డివిఎస్ గిరి, చాట్ల నరసింహారావు, పసుపులేటి రామ్మూర్తి, రావి హనుమంతరావు, ఆర్ఆర్ ఎస్ ప్రసాద్, లక్కాకుల పెంచలయ్య, లెనిన్, వరద శ్రీధర్, బలిజ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పాపం.. విద్యుత్ ఛార్జీల శాపం



**ఉదయగిరి, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి టీడీపీ కార్యాలయం నందు ఆదివారం ఉదయగిరి టీడీపీ మండల కన్వీనర్ బయన్న యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు విడిపోయిన అనంతరం 2014లో అధికాం చేపట్టిన ముఖ్యమంత్రి తన అనుభవంతో లోటు విద్యుత్‌ను 2019 కి మిగులు విద్యుత్‌గా చేసిన నేత ముఖ్యమంత్రి అని ఉదయగిరి టీడీపీ మండల కన్వీనర్ సీహెచ్ బయన్న పేర్కొన్నారు. ఆదివారం ఉదయగిరిలోని టీడీపీ పార్టీ కార్యాలయం నందు తెలుగుదేశం ముఖ్య నేతలు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం ఉదయగిరిలో వైసీపీ నేతలు విద్యుత్ ఛార్జీలపై ర్యాలీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన నిర్వాకం వలనే నేడు విద్యుత్ ఛార్జీల భారం అని తెలిపారు. ఆనాడు జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పాపం నేడు విద్యుత్ ఛార్జీల భారం శాపం అన్నారు. జగన్ అసమర్ధత, విద్యుత్ సంస్థలపై పెరిగిన అప్పులు, పీటీపీఎస్, కృష్ణపట్నం ధర్మల్, పోలవరం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు జాప్యం, విద్యుత్‌కు నష్టం జరిగిందన్నారు. 5 సంవత్సరాల కాలంలో పది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. మైలవరం సోలార్ ప్లాంట్‌లపై దాడి చేసి ధ్వంసం చేయడం వల్ల 7వేల మెగా వాట్ల విద్యుత్ కోల్పోవడం జరిగిందన్నారు. టీడీపీ అధికారం చేపట్టిన అనతి కాలంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ కులవృత్తుల వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. ఆక్వా రైతులకు ఒక రూపాయి 50 పైలసకే యూనిట్ విద్యుత్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనాడు రాష్ట్రంలో 20 వేల మెగా వాట్ల విద్యుత్ సామర్థ్యం గల విద్యుత్ ప్లాంట్లను ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. మీ నేత చేసిన పాపం ప్రజల మీద భారం పడింది తప్ప ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తప్పిందం లేదని అన్నారు. ఉదయగిరిలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడిన మాటలు నేతి బీరకాయలో నెయ్యి లాంటివి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వనర్ చింతనబోయిన బయన్న యాదవ్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రియాజ్, బొజ్జ నరసింహులు, తుమ్మల కిరణ్ కుమార్, ఎస్సీ సెల్ నాయకులు నరసింహ, రామ్‌మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, చిన్న వెంకటయ్య, నాగయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## గండిపాలెం పంచాయతీలో రెవెన్యూ సదస్సు




**ఉదయగిరి, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** గండిపాలెం పంచాయతీలో ఆదివారం గ్రామం నందు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సమీక్షించారు. గ్రామాలలో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. గ్రామంలో పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. భూ సమస్యలు ఉన్న పలువురు రైతులు నుండి అర్జీలను స్వీకరించారు. సత్వర పరిష్కారానికి సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బి, వీఆర్వో పంచాయతీ సర్పంచ్ గొల్లపల్లి కల్పన, ఎంపీటీసీ గుంటుపల్లి మాలకొండయ్య, గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేరు వేరు దాడులలో ఇరువురు సారావిక్రయ దారులు అరెస్ట్



బిట్రగుంట డిసెంబర్ 29 ప్రభాతవార్త: బోగోలు మండలం లో ఆదివారం నిర్వహించిన ఎక్సైజ్ శాఖ నిర్వహించిన వేరు వేరు దాడులలో ఇరువురుసారా విక్రయదారులను అరెస్టు చేసినట్లు కావలి ఎక్సైజ్ సిఐ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఆంజనేయులు ఆయన సిబ్బంది నిర్వహించిన దాడులలో కప్పరాల తిప్పలోని బాలయోగి గురుకుల పాఠశాల సమీపంలో రామాపురం కు చెందిన కే.సుధాకర్ వద్ద 10 లీటర్ల నాటు సారా, మోటార్ సైకిల్ ను, కావలి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో బోగోలు చెరువు సమీపంలో తలపల యేసయ్య వద్ద 10 లీటర్ల నాటు సారా 50 లీటర్ల బెల్లపుఊట స్వాధీనం చేసుకుని బెల్లపుఊటను ధ్వంసం చేసి, ఇరువురిని అరెస్ట్ చేసి కావలి ఎక్సైజ్ ఎస్ఐ ఎం. దేవికకు అప్పజెప్పి కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు..

## గుర్తు తెలియని వాహనం ఢీ కోని వ్యక్తి మృతి



**రాపూరు, డిసెంబరు29ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కోని కోండిపోగు ఈశ్వరయ్య(45), మృతి చెందాడు. పట్టణంలోని భారత్ పెట్రోలియం బంకు వద్ద నడచి వెల్తున్న ఈశ్వరయ్యను గుర్తు తెలియని వాహనం ఢీ కోట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆయనను గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమద్యంలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

## పేకాటస్థావరంపై రూరల్ పోలీసుల దాడులు



**కావలి, డిసెంబర్29 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం కొండయ్యగారిపాళెం గ్రామంలోని పోలేర మ్మ గుడిపక్కన పేకాట స్థావరంపై కావలి రూరల్ పోలీసులు ఆదివారం ఆకస్మికంగా దాడులు నిర్వహి ంచారు. రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు ఉత్తర్వులు మేరకు కావలి రూరల్ ఎస్ఐ తిరుమల రెడ్డి, పోలీసుసిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకు న్నారు. వారివద్ద ఉన్న 1280 రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు. ఎక్కడైనా గ్రామాల్లో పేకాట, కోడిపందేలు ఆడుతున్నా, గంజాయి అమ్ముతున్నా సమాచారం ఉంటే పోలీసులకు తెలియచేయాలని రూరల్ సిఐ జి.రాజేశ్వరరావు తెలిపారు.

## సామాజిక చైతన్యానికి నాంది "కలయిక విజ్ఞానకేంద్రం" కలయిక విజ్ఞానకేంద్రం కన్వీనర్లు



**కావలి, డిసెంబర్29 ప్రభాతవార్త :** సామాజిక చైతన్యానికి, యువత ప్రగతిశీలతకు నాందిప లికేలా "కలయిక విజ్ఞానకేంద్రం" నడుస్తుందని కన్వీనర్లు జి.రామ్‌ప్రసాద్, ఇలింద్ర లావణ్యలు తెలిపారు. ఆదివారం కలయిక కళ్యాణమ ండపంలో కలయిక విజ్ఞానవేదిక కార్యవర్గ ఏర్పాటు నిర్వహణకోసం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విశ్రాంత ప్రధానో పాధ్యాయురాలు, ఉమెన్‌ఫోర్స్ కన్వీనర్, వివిధ సంఘాల బాధ్యురాలు చాకలికొండ శారద అధ్యక్షత వహించారు. కలయిక విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవానికి జెడి ఫౌండేషన్ అధినేత జెడి లక్ష్మీనారాయణ, లోక్‌సత్తానేత జయప్రకాష్ నారాయణలను ఆహ్వానించే ఆలోచనలో ఉన్నామని కన్వీనర్లు తెలిపారు. భారతదేశపు తొలి మహిళాటీచర్ సావిత్రిబాయిపూలే జయంతిని నిర్వహించేందుకు కమిటి నిర్ణయం తీసుకుందన్నారు. పాఠశాల విద్యార్థుల్లో పుస్తక పఠనాభిలాషను, విజ్ఞానాన్ని, తద్వారా మానసిక వికాసం, ఉల్లాసం కల్గిస్తామన్నారు. గాయకుడు ఎస్.రామచంద్రరావు ప్రతి ఆదివారం 10 గంటలకు బాల, బాలికలకు, విద్యార్థులకు దేశభక్తిగీతాలు, లలితసంగీతంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. కలయిక విజ్ఞానకేంద్ర ఆవరణంలో వివిధ సామాజిక సంస్థలు తమతమ కార్యక్రమాలను నిర్వహణఖర్చు మాత్రమే చెల్లించి నిర్వహించుకోవచ్చునని తెలిపారు. కులం, మతం, రాజకీయపార్టీలకతీతంగా నిర్వహించడం నిబంధనగా గుర్తించాలన్నారు. **–నూతన కార్యవర్గం...** కలయిక విజ్ఞానకేంద్రం, గ్రంధాలయం నిర్వహణకు నూతనంగా కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. కన్వీనర్లుగా జి.రామ్‌ప్రసాద్, ఇలింద్ర లావణ్య, కార్యవర్గ సభ్యులుగా మాకినేని అరుణ, ఎల్.శ్యామల, చాకలికొండ శారద, జి.హరనాథ్‌రెడ్డి, తోట వెంకటేశ్వర్లు, కె.మాధవరావు, ఎంవి రమణయ్యలు ఎంపికయ్యారు. కలయిక విజ్ఞానకేంద్రానికి ప్రత్యేక గుర్తింపు తేవాలని చాకలికొండ శారద తెలిపారు.

## విద్యుత్ ఛార్జీలు పెంచిన పాపం జగన్‌రెడ్డిదే




**కందుకూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో చేసిన తప్పులు, పాపాలే విద్యుత్ ఛార్జీల పెంపునకు కారణమని, విద్యుత్ ఛార్జీలు పెంపు పాపం జగన్‌రెడ్డిదేనని మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీ నరసింహం(చిన్న) ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుండి 2024 వరకు ఈ ఐదేళ్లలో విద్యుత్ కొనుగోలు, ఒందుకు సంబంధించిన విషయాల్లో జగన్ చేసిన అవినీతి వల్లే రాష్ట్రంలో రూ.1,29,000 కోట్లు విద్యుత్ భారాలు ప్రజలపై విద్యుత్ ఉత్పత్తి సంస్థల పద్దాయని వారు ఆరోపించారు. వైకాపా ప్రభుత్వ సమయంలో గత పాలకులు చేసిన పాపాలు ఈ రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాపాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 2019-24 మధ్య అవగాహన లేని పరిపాలన వల్ల రాష్ట్రాన్ని అథోగతి పాలు చేసిందని ధ్వజమెత్తారు. 2019లో తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే సమయానికి మిగులు కరెంటుతో రాష్ట్రాన్ని జగన్‌మోహన్‌రెడ్డికి అప్పగించామని, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం జగన్ అధికారంలో ఉన్న సమయంలో ఇష్టారాజ్యాంగా విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై వేసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ఈఆర్సీని కోరారని గుర్తు చేశారు. 2022-23, 2023-24 సంవత్సరాలకు గాను ప్రజలపై భారం మోపాలని జగన్ ప్రభుత్వం ఆ ఛార్జీలను ఆమోదం తెలిపి ఈఆర్సీకి పంపిందని, అంటే ఆ ఛార్జీలు రెండేళ్ల కిందటే జగన్ హయాంలోనే వేయాల్సి ఉందని, అయితే ఈఆర్సీ మాత్రం రెండేళ్ల వరకు వాయిదాల పద్దతిలో గత వైసీపీ ప్రభుత్వం జగన్ నెట్టుకొని వచ్చిందని వివరించారు. ఒక వేళ ఆ సందర్భంలో పెంచితే జగన్ ప్రభుత్వంపై 2024 ఎన్నికల్లో వ్యతిరేకత వస్తుందని 2024 మార్చికి వాయిదా వేశారన్నారు. ఇప్పుడు పెంచాల్సిన ట్రూ ఆఫ్ ఛార్జీలు జగన్ ప్రభుత్వంలో పెంచాల్సినవేనని, వారి హయాంలో పెంచాల్సిన ఛార్జీలపై ఇప్పుడు జగన్ వారి బృందాలే నియోజకవర్గం కేంద్రాల్లో విద్యుత్ ఛార్జీలపై ధర్నాలు, ఆందోళన నిరసనలు చేయటమనేది హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవ చేశారు.

## కూచిపూడి స్వర్ణోత్సవాలలో పాల్గొన్న సంయుక్త నృత్య కళానిలయం చిన్నారులు



**కావలిరూరల్, డిసెంబర్29 ప్రభాతవార్త :** కృష్ణాజిల్లా మువ్వమండలం కూచిపూడి గ్రామంలో కూచిపూడి కళాక్షేత్రంనందు కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్ సొసైటివారి ఆధ్వర్యంలో కూచిపూడిపతాక స్వర్ణోత్సవాలలో భాగంగా ఆదివారం మూడవరోజు రెండువేలమంది కళాకారులతో మహాబృంద నాట్యం జరిగింది. ఈ మహాబృంద నాట్యంలో కావలి పట్టణానికి చెందిన సంయుక్త నృత్యకళానిలయం నాట్యగురువు గంగపట్నం లిఖిత మరియు ఆమె శిష్యులు షేక్.హసీనా, సిహెచ్ మోక్షశ్రీ, సాయినిహారిక, బి.యసశ్రీవిద్య, సయ్యద్ అర్షియ, వి.లక్ష్మిపల్లవి, రిషిత, రక్షిత, ఈ.కృష్ణప్రియ, మనస్వి, రిత్విక, జి.ఇందుప్రియ పాల్గొని నృత్య ప్రదర్శన చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా సాంస్కృతిక, టూరిజం, సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్ మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక శాసనసభ్యులు వరదకుమార్, కృష్ణాజిల్లా కలెక్టర్ డికె.బాలాజి, మంజుభార్గవి, కూచిపూడి నృత్యగురువు డాక్టర్ వేదాంతం వెంకటనాగచలపతిలు హాజరయి మాట్లా ్లడారు. అంతరించిపోతున్న కళలను బతికిస్తున్న నాట్యగురువులను, నేర్చుకుంటున్న కళాకారులను, నేర్పిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. 2వేలమంది కళాకారులతో ఏర్పాటుచేసిన మహాబృందనాట్యం ఎంతగానో అలరించిందని తెలియచేశారు.

## యాచకులకు దుప్పట్లు భోజనం పంపిణి చేసిన బ్రాహ్మణ మహాసంఘం



**కావలిరూరల్, డిసెంబర్29 ప్రభాతవార్త :** కావలి బ్రాహ్మణ మహాసంఘం అద్యక్షులు పివియస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిధులు డాక్టర్ దూబగుంట రవికుమార్ పాల్గొని ఆదివారం యాచకులకు దుప్పట్లు, భోజనంప్యాకెట్లు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణమహాసంఘం కోశాధికారి ఆర్వి కళాధర్‌రావు, వైస్ ప్రెసిడెంట్లు టి.వెంకటేశ్వర్లు, గంగు చంద్రశేఖర్, గాడేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, రాష్ట్ర వైస్ ప్రెసిడెండ్ యంవియస్ రాజేంద్రకుమార్, ప్రాంతీయ కార్యదర్శులు ఎ.రమణమూర్తి ఎవి.చలపతిరావు, వి.సునీల్‌కుమార్, జివి మూర్తులు పాల్గొన్నారు.

**-స్వర్గీయ దూబగుంట భాస్కర్‌రావు సంతాపసభ...**కావలిపట్టణానికి చెందిన స్వర్గీయ డాక్టర్ దూబగుంట భాస్కర్‌రావు సంతాపసభ కావలి పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలనందు ఆదివారం జరిగింది. ఈ సంతాపసభలో కావలి బ్రాహ్మణమహాసంఘం అద్యక్షులు పివియస్ ప్రసాద్, స్వర్గీయ దూబగుంట భాస్కర్‌రావు తనయుడు డాక్టర్ దూబగుంట రవికుమార్, బ్రాహ్మణ మహాసంగం కోశాధికారి ఆర్వి కళాధర్, వైస్ ప్రెసిడెంట్ గంగు చంద్రశేఖర్, ఎంవియస్ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొని స్వర్గీయ డాక్టర్ దూబగుంట భాస్కర్‌రావు చేసిన సేవలను కొనియాడారు.

## రైతు జిల్లా అధ్యక్షుడుగా షేక్ షాన్వాస్



**ముత్తుకూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త** : రైతు సంఘం జిల్లా అధ్యక్షుడుగా షేక్ షాన్వాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సిపిఐ నాయకులు సమావేశం నిర్వహించి అధ్యక్షులను ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులుగా షేక్ షాన్వాస్ మాట్లాడుతూ తన పై నమ్మకం వుంచి తనను ఎన్నుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు పోరాడుతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ మున్నా, సిపిఐ సర్వేపల్లి నియోజకర్గం కార్యదర్శిగా కొమారి నందయ్య, మండల కార్యదర్శిగా తుంగ ఏడుకొండలు, ఏఐవైఎఫ్ సర్వేపల్లి నియోజకవర్గం కన్వీనర్‌గా షేక్ అన్సర్, సిపిఐ మండల కమిటీ సభ్యులు ముజీబ్ భాష, సిపిఐ నాయకులుగా రొయ్యల రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆదాలకు ముందస్తు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపిన స్వర్ణ వెంకయ్య నెల్లూరు రూరల్,



**డిసెంబర్ 29, ప్రభాతవార్త** : నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డికి దక్షిమధ్య రైల్వే బోర్డ్ సభ్యులు స్వర్ణ వెంకయ్య 2025 నూతన సంవత్సర ముందస్తు శుభాకాంక్షలు తెలియజేసీ దుశాలువతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. అదేవిధంగా విజయ డైరీ చైర్మన్ కొండ్రెడి రంగారెడ్డికి 2025 నూతన సంవత్సరం ముందస్తు శుభాకాంక్షలను తెలియజేశారు. క్యాంపు కార్యాలయం చేరుకున్న వయసు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అందరు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డికి నూతన ముందస్తు సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## గ్రంధాలయంలో పుస్తక పఠనం



**ఉలవపాడు, డిసెంబర్ 29, ప్రభాతవార్త** : ఉలవపాడు శాఖా గ్రంధాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్ధులచే పుస్తక పఠనం చేయించి నీతి కథలు గ్రంధపాలకుడు చెప్పారు. అనంతరం క్యారమ్స్, డాన్స్, పాటలు పాడించారు. గ్రంధాలయ అధికారి దాసరి కోటేశ్వరరావు మాట్లాడుతూ విజ్ఞానం ప్రార్ధనకు గ్రంధాలయాలు దోహదం చేస్తాయని అన్నారు. పుస్తక పఠనంతో విద్యార్ధులలో మేధోశక్తి పెరుగుతుందని అన్నారు. ఏకాగ్రత వల్ల పిల్లలు వారి మనసు భాగా అన్వేషించడానికి కొత్త ఆలోచనలతో ముందుకు రావడానికి సహాయ పడుతుందని అందువలన పిల్లల మెమరీ పవర్ కూడా పెరుగుతుందని అన్నారు. ఉలవపాడు శాఖా గ్రంధాలయానికి అనుబంధంగా ఉన్న చాకిచర్ల గ్రంధాలయంలో కూడా చదవడం మాకిష్టం కార్యక్రమం లైబ్రేరియన్ రాణిమ్మ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది.

## ఘనంగా విష్ణు సహస్రనామ పారాయణం



**కోవూరు, డిసెంబరు29 ప్రభాతవార్త :** కోవూరులోని కోదండరామస్వామి దేవస్థానంలో మార్గశిర మాస ఆదివారం భక్తబృందం విష్ణు సహస్రనామ పారాయణాన్ని సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## రాయల్ కాప్స్ సంఘం జిల్లా మహిళ అధ్యక్షురాలుగా బాసిశెట్టి శైలజ



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** కాపుల అభ్యున్నతికి దోహదపడుతున్న రాయల్ కాప్స్ సంఘం మహిళా అధ్యక్షులుగా నెల్లూరుకు చెందిన బాసిశెట్టి శైలజని నియమించారు. ఈ మేరకు రాయల్ కాప్స్ దేవి నాయుడు, ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నరసింహలు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ నెల్లూరులో కాపుల అభ్యున్నతికి తన శాయశక్తుల పనిచేస్తానని పేర్కొన్నారు. కాపులలో అధికంగా వెనకబడి ఉన్నత విద్యను పొందలేని కుటుంబాల పిల్లలను ఉన్నత స్థాయి విద్యలు అందేలా చేయడమే రాయల్ కాప్స్ యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## మహిళలకు చీరలు పంపిణీ



**వింజమూరు,డిసెంబర్29,ప్రభాతవార్త:** వింజమూరులోని అశోక్‌నగర్ ప్రాంతపరిధిలోని పరిశుద్ధ ఆత్మ మందిరంలో ఆదివారం పాస్టర్ ఏసుదా సు ఆధ్వర్యంలో ప్రార్ధనా మందిరానికి వచ్చిన మహి ళలకు, పురుషలకు చీరలు, పంచలు అందజేశారు. ఈసందర్భంగా ఏసు దాసుమాట్లాడుతూ ఏసు చూపిన శాంతి మార్గంలో పయనిస్తూ పరుల పట్ల ప్రేమ , కరుణ, సేవా తత్వాలను క్రైస్తవుడు పెం పొందిం చుకోవాలన్నారు. ఈర్షా , ద్వేషాలను విడనాడాలన్నారు. అబద్ధం, అవినీతికి దూరంగా ఉండాల న్నారు. దేవుని సేవతో కోల్పోయిన ప్రతి ఒక్కదాన్ని పొందవచ్చున్నారు. పరిశుద్ధ ఆత్మ మందిరానికి వస్తున్న దైవజ నులకు తనవంతుగా క్రిస్మస్ పర్వదినం సందర్భంగా చీరలు పంపిణీ చేశామన్నారు. ఈకార్యక్రమంలో కాలనీలవాసులు పాల్గొన్నారు.

## పంటల వైవిధ్యంపై విద్యార్ధుల అవగాహన ర్యాలీ



**ఇందుకూరుపేట, డిసెంబర్ 29, ప్రభాతవార్త** : జాతీయ సేవ పథకంలో భాగంగా నాల్గో రోజు పల్లెపాడు గ్రామంలోని గాంధీ ఆశ్రమాన్ని ఎస్‌వి వ్యవసాయ కళాశాల విద్యార్ధులు సందర్శించడం జరిగింది. అక్కడ మనోజ్ గాంధీ, ఎన్.వనజ, మంజుల, ప్రొఫెసర్ అండ్ హెడ్ వి.శైలజ శ్రీ వెంకటేశ్వర కళాశాల విద్యార్ధుల ఆశ్రమం విశిష్టత, ఆశ్రమం చరిత్రను తెలుసుకున్నారు. ఎస్‌వి వ్యవసాయ కళాశాలలో చదువుతున్న విద్యార్ధులు, జగదేవి పేట గ్రామంలో పంటల వైవిధ్యం మీద అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు.

## ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి సిఐటియు నేతలు డిమాండ్



**కావలి, డిసెంబర్29 ప్రభాతవార్త :** కావలి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు నేతలు డిమాండ్‌చేశారు. కావలి సిఐటియు కార్యాలయంలో మున్సిపాల్ ఇంజనీరింగ్ కార్మికుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు నేత పసుపు లేటి పెంచలయ్య మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న జిఓ నెంబరు 36 ప్రకారం జీతాలు చెల్లించాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికులకు ప్రస్తుతం 15 వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. జీతాలు తక్కువ, పనిభారం ఎక్కువ అన్నారు. ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తూ పట్టణ ప్రజల అవసరాలు తీరుస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలోకూడా పనులు చేశారన్నారు.ఇంజనీరింగ్ కార్మికుల శ్రమను గుర్తించాలన్నారు. వారికి పనిముట్లు, కిట్లు, వాహనవ ఎరమ్మత్తులు, చట్టబద్దమైన శెలవులు తదితర సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వీరి సమస్యలు పరిష్కారం కావడంలేదని ఇంజనీరింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రతకూడా లేకుండాపోతుందని దుయ్యబట్టారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలన్నింటిని పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు బి.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు.

**-ఇంజనీరింగ్ కార్మికుల నూతనకమిటి...**

కావలి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నూతన కమిటీని ఎంపికచేశారు. అద్యక్షులుగా వై ఏసుదాసు, కార్యదర్శిగా డి.శ్రీనివాసులు, జాయింట్ కార్యదర్శిగా ఎస్.ప్రభాకర్, కమిటి సభ్యులు కె.పుల్లయ్య, యం. సత్య నారాయణ, యం.శివప్రసాద్, పి.మదన్‌మోహన్, నియమితులయ్యారు.

## కొత్త సినిమాలకు అధికడబ్బుల వసూలుకు జీఓలు ఇవ్వొద్దు దళిత సంఘర్షణ సమితి జిల్లా అద్యక్షులు యస్.మల్లి



**కావలి, డిసెంబర్29 ప్రభాతవార్త** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తసినిమా విడుదలపుడు అధిక డబ్బు వసూలు చేసేందుకు ప్రత్యేక జిఓలు ఇవ్వవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లాఅద్యక్షుడు యస్.మల్లి డిమాండ్‌చేశారు. కావలి ఆర్డీఓ కార్యాలయ ఆవరణ ంలో దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన నినాదాల ప్రదర్శన నిర్వహి ంచారు. ఆర్డీఓ వంశీకృష్ణకు వినతిపత్రం అంద చేశారు. సినిమా రిలీజ్ అప్పుడు అగ్రహీరోలకు కొత్త జీఓలు ఇవ్వడంవలన 100 రూపాయల టికెట్టు 1000 రూపాయలకు, 150 రూపాయల టికెట్టు 2000 వేలరూపాయలకు అమ్ముకుంటున్నారని తెలిపారు. అధికారపార్టీవారిని సినిమావారు ప్రలోభపరిచి ప్రత్యేక జీఓలు వచ్చేవిధంగా చేసి వందలకోట్ల రూపాయలు సామాన్య ప్రేక్షకుడి దగ్గర దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. అధికప్రచారంచేసి ప్రేక్షకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం సహకరించడం దుర్మార్గమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పేదప్రేక్షకులను దోచుకుని హైదరాబాదులో పెట్టబడులు పెట్టుకుంటూ ఆ డబ్బులతో కొత్తకొత్త విమానాలు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఆంధ్రానుండి ఒక్క మహిళను కూడా హీరోయిన్‌ను చేయడంలేదన్నారు. ముంబాయి నుండి దిగుమతిచేసుకుని ప్రేక్షకులను దోచుకుంటు న్నాం ్నారు. ఈ సంస్కృతిని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అరికట్టాలని తెలిపారు. ఈ సినిమా లవలన సమాజానికి ఎటువంటి ప్రయోజం ఉండడం లేదన్నారు. ప్రత్యేక జీఓను ఇచ్చినందువలన వినోదపు పన్ను, ఆదాయపుపన్ను, థియేటర్లకు వచ్చేపన్ను ఎగ్గొడుతున్నారని తెలిపారు. దొంగలను తయారు చేసే విధంగా ఈ సినిమాలు ఉంటున్నాయన్నారు. జీఓలను రద్దుచేయాలన్నారు. సినిమా థియేటర్లవద్ద చనిపోయినవారిని పట్టించుకోవడంలేదన్నారు. అగ్రహీరోలు టీ తాగడానికి దుబాయ్‌కి, భోజనానికి మలేషి యాకు వెళుతున్నా రన్నారు. వారివద్ద ముక్కుపిండి పన్నులు వసూలుచేయాలన్నారు. ప్రత్యేక జిఓలు ఇస్తే ఉద్య మాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్, హుస్సేన్, వెంకట రత్నం, తదితరులు పాల్గొన్నారు.

## 31న సామాజిక పింఛన్లు పంపిణీ



**ఉలవపాడు,డిసెంబర్ 29, ప్రభాతవార్త** : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉలవపాడు మండల పరిధిలోని పింఛన్ లబ్దిదారులకు ఈనెల 31న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఎన్.విజయ ఆదివారం తెలిపారు. డిసెంబర్ నెలకు సంబంధించిన పింఛన్లను 2025 జనవరి ఒకటి, రెండవ తేదీల్లో పంపిణీ చేయాల్సి ఉండగా జనవరి ఒకటి నూతన సంవత్సరం సందర్భంగా పింఛన్లను ఒక రోజు ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 31తో పాటు 2025 జనవరి 2వ తేదీ కూడా పింఛన్లు అందజేస్తామని చెప్పారు. సచివాలయ సిబ్బంది పింఛన్ లబ్దిదారుల ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు అందజేస్తారని తెలిపారు. లబ్దిదారులు సచివాలయాల వద్దకు గాని, పంచాయతీ కార్యాలయం వద్దకు గాని వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన పింఛన్ లబ్దిదారులు 31వ తేదీ పింఛన్ తీసుకునేందుకు అందుబాటులో ఉండాలని కోరారు. ఏదైనా ఇతర కారణాలతో 31వ తేదీ పింఛన్ తీసుకోని వారు 2025 జనవరి 2వ తేదీ తప్పనిసరిగా పింఛన్ తీసుకోవాలని కోరారు.

## సంగం మండలంలో పలు రోడ్డు ప్రమాదాలు 10 మందికి గాయాలు- ఒకరు మృతి



**సంగం డిసెంబర్ 29 ప్రభాతవార్త :** సంగం మండలంలో ఆదివారం పలు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.సంగం,కొరిమెర్ల, తరుణవాయి, దువ్వూరు వద్ద రోడ్డు ప్రమాదాలు చోటు జరిగాయి.సమాచారం అందుకున్న వెంటనే సిఐ వేమారెడ్డి,ఎస్ రాజేష్ సంఘటనా స్దలాలకు చేరుకున్నారు. క్షతగాత్రులను వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు. దువ్వూరు వద్ద ఆటో యాక్సిడెంట్,అలాగే దువ్వూరు వద్ద కారు బోల్తా పడి ఒకరికి గాయాలు, ఇలా పలు ప్రమాదాలు జరిగాయి.సంగంలో మోటార్‌బైకు యాక్సిడెంట్‌లో మహిళ మృతి.ఈ సందర్బంగా సిఐ వేమారెడ్డి మాట్లాడుతు మద్యం త్రాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగతాయని వాహన చోదకులు అప్రమత్తంగా వ్యవహారించాలని ఆయన సూచించారు.

## 21 అడుగులకు చేరిన రాళ్లపాడు నీటిమట్టం



**లింగసముద్రం, డిసెంబర్ 29, ప్రభాతవార్త** : రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం 21 అడుగులకు చేరింది. శనివారం రాత్రి ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం పెరగడంతో 10.30లకు రాళ్లపాడు నీటి మట్టం 21అడుగులకు చేరడంతో ప్రాజెక్టు డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ చంద్రమౌళి ప్రాజెక్టు సిబ్బంది 3వ నెంబరు గేటును అరడుగు ఎత్తి నీటిని మన్నేరుకు విడుదల చేశారు. ఆదివారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో ప్రాజెక్టు లోనికి నీటి ప్రవాహం తగ్గడంతో గేటును దించారు. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 21 అడుగుల నీటిమట్టం చేరిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహం లేదని తెలిపారు.

## ఘనంగా చాముండేశ్వరి దేవి పొంగళ్ళు

**ముత్తకూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త** : ముత్తుకూరు మండలంలోని మామిడిపూడి గ్రామంలో వెలసిన శ్రీ చాముండేశ్వరి దేవి 16 రోజుల పండుగ వేడుకలుఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు బల్లెం ఆదిశేషయ్య మాట్లాడుతూ గ్రామంలో అమ్మవారిని ఏర్పాటు చేసి 17వ ఏడాది సందర్భంగా ఇటీవల ఆలయ 17వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. అలాగే 16వ రోజుల పండుగను నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అమ్మవారి భక్తులు ప్రత్యేక భజనలు, భక్తి గీతాలు పాడుతూ అందరినీ అలరించారు.

## రూరల్‌లో ఏ చిన్న సమస్య వచ్చినా ఒక్క ఫోన్ కాల్ లేదా మెసేజ్ చేయండి : ఎమ్మెల్యే కోటంరెడ్డి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 29, ప్రభాతవార్త** ఎన్నికలవరకే రాజకీయాలు. ఎన్నికలు తరువాత రాజకీయ జెండాలు లేకుండా అభివృద్దే అజెండాగా పని చేద్దాం. ఎన్నికల వేళ మాత్రమే వచ్చే రాజకీయ నాయకులు చాలామంది ఉంటారు.ఎన్నికలు ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల మధ్య ఉండడం నాకు ఇష్టం. మీకు ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా ఒక్క ఫోన్ కాల్ లేదా మెసేజ్ చేయండి. స్పందించేదానికి మీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిగా నేను కానీ, నా తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కానీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం రూరల్ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి చెప్పారు. గత ప్రభుత్వంలో టెంకాయలు కొట్టి పనులు ప్రారంభించ లేదు. నేను టెంకాయ కొట్టానంటే పని పూర్తికావలసిందే. అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26వ డివిజన్, డ్రైవర్స్ కాలనీ బిట్ 2లో సుమారు 40 లక్షల రూపాయల నిధులతో డబ్ల్యూబిఎం రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మరియు స్థానిక కార్పొరేటర్ బూడిద సుప్రజ గత 6 నెలల్లో ఈ 26వ డివిజన్ లో 1 కోటి 25 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గత వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు నిధులు కావాలని అడిగినా స్పందించే నాధుడే లేదు. ఎన్నికలవరకే రాజకీయాలు. ఎన్నికలు తరువాత రాజకీయ జెండాలు లేకుండా అభివృద్దే అజెండాగా పనిచేద్దాం. ఎన్నికలవేళ మాత్రమే వచ్చే రాజకీయ నాయకులు చాలామంది ఉంటారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల మధ్య ఉండడం నాకు ఇష్టం. మీకు ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా ఒక్క ఫోన్ కాల్ లేదా మెసేజ్ చేయండి. స్పందించేదానికి మీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిగా నేనుకానీ, నా తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కానీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం. గత ప్రభుత్వంలో టెంకాయలు కొట్టి పనులు ప్రారంభించలేదు. నేను టెంకాయ కొట్టానంటే పని పూర్తికావలసిందే. ప్రజలు ఎమ్మెల్యే అంటే మా కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి లా ఉండాలి అని గర్వంగా చెప్పుకొనే విధంగా ముందుకు సాగుతా అని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జి ఊరందూరు సురేంద్ర బాబు, టిడిపి నాయకులు బూడిద పురుషోత్తం యాదవ్, శివచారి, జహీర్, నరసింహ ముదిరాజు, వెంకన్న, ఎల్.పి. కృష్ణారెడ్డి, గౌస్, మాధవి, జనసేన నాయకులు సూచిత్, తదితరులు పాల్గొన్నారు.

## కొండ్రెడ్డిని సత్కరించిన జిల్లా వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 29, ప్రభాతవార్త** నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షులుగా నియమితులైన ముంగమూరు ఆశ్రిత్ రెడ్డి కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఆదాల ప్రభాకర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. నూతన జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులుగా నియమితులైన ముంగమూరు ఆశ్రిత్ రెడ్డిని కొండ్రెడ్డి రంగారెడ్డి అభినందించారు. ఏపీస్టేట్ ఎంఎస్ఎమ్ఈ మాజీ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, విద్యార్థి విభాగం నాయకులు లిఖిత్, సిద్ధార్థ ,హర్ష తదితరులు ఉన్నారు.

## గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 29, ప్రభాతవార్త** నెల్లూరులోని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం యునైటెడ్ వెల్ఫేర్ జీఎస్‌డబ్ల్యూఎస్ గవర్న మెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ప్రచురించారు. ఇందులో భాగంగా అసోసియేషన్ నాయకులు ఒంగోలు తూర్పు నాయుడుపాలెంలో మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామిని కలిశారు. ఆయన్ని ఘనంగా సత్కరించారు. మంత్రి చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరింపజేశారు.అసోసియేషన్ సమస్యలపై అసోసియేషన్ జేఏసీ సెక్రటరీ జనరల్ జి. రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి త్వరలో అందరికి న్యాయం జరిగే విధంగా రేషనలైజేషన్ ప్రక్రియ ఉంటుందని తెలియజేశారు.మోహన్ కృష్ణ, మనీషా, హరి, మనోజ్, శ్రీకాంత్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇకనైనా మారండి



కోవూరు, డిసెంబరు29 ప్రభాతవార్త : సమాజంలో రౌడీ షీటర్లుగా , అనుమానితులుగా ఇతరత్రా కేసుల్లో ముద్ర పడిన వ్యక్తులు ఇకనైనా మారి సమాజంలో బుద్ధిగా బతికేలా దృష్టి పెట్టాలని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్, తెలిపారు. కోవూరు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం రౌడీ షీటర్లుగా ముద్ర పడిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలిసో తెలియకో ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని, ఇకనైనా తమ తీరు మార్చుకుని సమాజంలో బుద్ధిగా బతికేలా చూడాలన్నారు. ఈ విధంగా ముద్రపడి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులో ఉన్న వారిపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. గొడవలు, దౌర్జన్యాలు ఇతర నేర కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పాత జీవితానికి స్వస్తి చెప్పి కొత్త జీవితానికి ప్రతి ఒక్కరూ మంచి నడవడికతో ముందుకు సాగాలన్నారు.

## వైకాపా నుండి టీడీపీలోకి భారీ చేరికలు





**కందుకూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త** ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో కందుకూరు పట్టణంలోని ఐదో వార్డు నుండి చనమాల శ్రీధర్ ఆధ్వర్యంలో, 18వవార్డు సయ్యద్ మూస ఆధ్వర్యంలో దాదాపు33 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారిని సావదానంగా పార్టీలోకి ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ తనమీద ఉన్నటువంటి ప్రేమాభిమానాలతో నమ్మకంతో పట్టణంలోని 5,18 వార్డుల నుంచి వైకాపాను వీడి భారీగా టీడీపీలో చేరడం ఆనందదాయకమన్నారు. వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి, వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వమిళలు అశేషంగా పాల్గొనడం ఒక విశేషం. పార్టీలో చేరిన అనంతరం సయ్యద్ మూస, చనమాల శ్రీధర్ మాట్లాడుతూ గతంలో నిరాధరణకు గురవడం వల్ల, ఇంటూరి నాగేశ్వరరావు ఆరు నెలల పరిపాలన సుభిక్షంగా, సామరస్యంతో ఉండటంతో తాము ఆకర్షితులైనట్లు వారు తెలిపారు. ఎల్లవేళలా ఎమ్మెల్యేకి తమ సహాయ సహకారాలు అందిస్తామని వారు ఇరువురు హామీ ఇచ్చారు. సయ్యద్ మూస గజమాల, శాలువాతో ఎమ్మెల్యే నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సీహెచ్ కొండయ్య, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులురఫీ, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు పులి నాగరాజు, సీనియర్ నాయకులు పొడపాటి నరసింహం, మాదాల మాల్యాద్రి,బృందావనంవార్డు నాయకుడు శ్యామ్, నూకతోటి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## బలిజ ఆత్మగౌరవ సభలో రమాదేవి



**నెల్లూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయం సమీపంలోని కాపు భవన్‌లో.. మిరియాల వెంకటరావు, వంగవీటి మోహనరంగా జయంతులను పురస్కరించుకుని జరిగిన రాయలసీమ బలిజ ఆత్మగౌరవ సభలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు రమాదేవి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఆమెతో పాటు జనసేన,టీడీపీ నాయకురాళ్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బలిజ పేద మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు, టాలెంట్ అవార్డులు, ప్రతిభావంతులకు ప్రతిభా పురస్కారంతో పాటు ముఖ్య అతిధులకు పొంగూరు రమాదేవి చేతుల మీదుగా బలిజ బంధు పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రమాదేవి మీడియాతో మాట్లాడుతూ బలిజ పేద మెరిట్ విద్యార్థులు ఉపకార వేతనాలు అందజేయడం గొప్ప విషయమని నిర్వాహకుల్ని కొనియాడారు. బలిజలందరూ ఐక్యమత్యంగా ఏకమై సమావేశం నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి మంత్రి నారాయణ సహాయ సహకారాలు కూడా బలిజలకు ఉంటాయని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి నిర్వహించిన వెలిశెట్టి శ్రీహరి రాయలుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు. రాయలసీమ బలిజ మహాసభ వ్యవస్థాపక రాష్ట్రఅధ్యక్షులు శ్రీహరి రాయలుమాట్లాడారు. అనంతరం రాయలసీమ బలిజ 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించి అందరికి పంచిపెట్టారు.కార్యక్రమంలో బలిజలు,కూటమినాయకులు,కార్యకర్తలు, మహిళా నాయకులు, బలిజ విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తూర్పుపడమర ప్రాంతాలను కలిపేలా రైల్వే ఫ్లైఓవర్



**నెల్లూరు, డిసెంబర్29, ప్రభాతవార్త** నెల్లూరులోని తూర్పు పడమర ప్రాంతాలను కలిపేలా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు నెల్లూరు అర్బన్ డవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని స్టోన్ హౌస్ పేటలోని పాండురంగ అన్నదాన సమాజంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దంపతులు పాల్గొన్నారు. కోటంరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆర్యవైశ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన అన్నారు. తన పొలిటికల్ కెరీర్లో ఆర్యవైశ్యుల సహకారం మరువలేనిదని స్పష్టం చేశారు. స్టోన్ పేటను పొట్టి శ్రీరాములు నగర్‌గా మార్చాలని మొదట్లో తానే ప్రతి పాదన తీసుకొచ్చానని, దానికి కట్టుబడి ఉన్నట్లు ఆయన అన్నారు. రెండోసారి నుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం తనకెంతో సంతోషంగా ఉందని ఆయన వెల్లడిం చారు. నెల్లూరులో తూర్పు పడమర ప్రాంతాలను కలిపేలా రైల్వే ఫ్లైఓ వర్ బ్రిడ్జి నిర్మాణానికి నుడా తరుపున కృషి చేస్తానని, మంత్రి నారాయణ సహకారంతో అవసరమైతే ముఖ్యమంత్రిని కూడా కలుస్తానంటూ వ్యాఖ్యానిం చారు. గతంలో తాను నుడా చైర్మన్‌గా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వ సహ కారం చాలా తక్కువగా ఉందని, అందుకే రైల్వే బ్రిడ్జి ఆలోచనను విరమించుకు న్నట్లు వెల్ల డించారు. ఈసారి కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి తూర్పు ప్రాంత ప్రజల కష్టాన్ని తీర్చేందుకు రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరిస్తానని స్పష్టం చేశారు. రూరల్ పరిధిలో ఎన్టీఆర్ పార్కు,ఎన్టీఆర్ నక్లెస్‌రోడ్డు నిర్మాణా నికి గతంలో తన వంతు సహకారం ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యాపార స్తులను బెదిరించి అధికారుల చేత దాడులు చేయించారని, అలాంటివి లేకుండా చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. వ్యాపారస్తులు అందరూ స్వేచ్ఛగా తమ వ్యా పారాలు చేసుకునే వాతావరణాన్ని కల్పిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో ఆర్యవైశ్య ప్రముఖులు భోగనాథం కిషోర్, పెసల నరసింహాస్వామి, భవ నాసి సురేష్‌బాబు, షణ్ముఖరావు, కోట గురుబ్రహ్మం, శ్రీరామ్ సురేష్, కొండా ప్రవీణ్ శేఖర్, మెంటా బ్రహ్మ గుప్త, దాస లక్ష్మీ నారాయణ, ఆర్‌కేటీ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## కామాక్షితాయికి లక్ష బిల్వార్చన



**సంగం డిసెంబర్ 29 ప్రభాతవార్త** మండ ల కేంద్రమైన సంగంలోని శ్రీకామాక్షి సమేత సంగమేశ్వర స్వామి వారి సన్నిధిలో వైభ వంగా లక్షసంఖ్యా బిల్వా ర్చన జరిగింది. ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కామాక్షితాయిని లక్ష బిల్వార్చనతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున ఈకార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని పూజించారు.

## సాగునీరు కాలువ ఇలా.. నీరు పారేది ఎలా..?



**కోవూరు, డిసెంబరు29 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పలు ప్రధాన సాగునీటి కాలువలు పూర్తిగా గుర్రపు డెక్క ఆకుతో నిండిపోయి ఉన్నాయి. ఈ గుర్రపు డెక్క ఆకు తొలగించేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు కూలీలు చేస్తున్నా కొన్ని నెలలకే మరలా ఈ గుర్రపు డెక్క ఆకుతో నిండిపోవడంతో సాగునీరు పారడం ప్రశ్నార్థకంగా మారింది. ఈ పథకం రాక ముందు రైతులే స్వచ్ఛందంగా తలా కొంత నగదు వేసుకుని ఈ కాలువలు శుభ్రం చేసుకునేవారు. ప్రస్తుతం ఈ ఎన్ఆర్ఈజీఎస్ పథకం రావడంతో రైతులు ఈ కాలువలపై ఆశించిన మేర దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఫలితంగా పలు గ్రామాల్లో సాగునీటి కాలువలు ఈ గుర్రపు డెక్క ఆకుతో పూర్తిగా నిండిపోయి ఉన్నాయి. గత ఐదు సంవత్సరాలుగా సాగునీటి సంఘాలకు గత ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం వచ్చిన కూటమి ప్రభుత్వం ఇటీవల సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వ హించింది. నూతనంగా ఏర్పడిన సాగునీటి సంఘాల అధ్యక్షులు ఈ పారుదల కాలువలపై ప్రత్యేక దృష్టి సారించి మరలా మరలా ఈ గుర్రపు డెక్క ఆకు ఈ కాలువల్లోకి రాకుండా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలలో బంగారు పతకాలు




**రాపూరు,డిసెంబరు29ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలోని అమీర్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలలో రాపూరులోని జెమ్స్ ఇంగ్లీషు మీడియం విద్యార్థులు బంగారు పతకాలు గెలుపొందారు. ఈ పోటీలలో పాఠశాలకు చెందిన 7 మంది విద్యార్థులు బంగారు పతకాలు పొందారు. వీరికి ఆదివారం నెల్లూరులోని టౌన్‌హాల్ నందు నిర్వహించిన అవార్డుల ప్రధానంలో కళాసంఘం ఆధ్యక్షులు అమరావతి కృష్ణా రెడ్డి, ప్రముఖ చిత్రకారిణి అన్నపూర్ణ,విశ్రాంత డ్రాయింగ్ ఉపాధ్యాయుడు పెంచలయ్య, తదితరులు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బులగాకుల మునీంద్రా రెడ్డి, పాఠశాల డైరెక్టర్ స్వాతి రెడ్డి, ప్రిన్స్‌పాల్ ఆదీల్,ప్రీ ఐఐటి కో ఆర్డినేటర్ ఎంపీ రత్నం తదితరులున్నారు.

## అదుపు తప్పిన మోటార్ సైకిల్
### - డివైడర్ ఢీకొని యువకుడు మృతి



**కోవూరు, డిసెంబరు29 ప్రభాతవార్త** : చిన్న చిన్న సంగీత పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఓ కుటుంబంలో రోడ్డు ప్రమాదం తీరని విషాదం నింపింది. త నకు కొరివి పెట్టాల్సి న కొడుకుకే తానే కొరివి పెట్టాల్సి న పరిస్థితి రావడంతో ఆ తండ్రి పడే రోధన వర్ణనాతీతంగా మారింది.మినీ జాతీయ రహదారి పనులు స్థానిక వేగూరు కాలు వ సమీపంలో అసంపూర్తిగా ఉండ డంతో నెల్లూరు నుంచి కోవూరుకు మోటార్ సైకిల్‌లో వస్తున్న ఓ యువకుడు ఈ గుంతల కారణంగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున పడుగుపాడులో చోటు చేసుకుంది. పోలీస్ సమాచారం మేరకు కోవూరు పంచాయతీలోని జంగంవీధి ప్రాంతానికి చెందిన తంబిసాయి వినీత్ (26) సంగీతం ట్రూప్‌లో డ్రమ్స్ వాయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మేరకు ఆది వారం తెల్లవారు జామున పనులు ముగించుకుని కోవూరుకు వస్తుండగా అదు పు తప్పి డివైడర్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టు మార్టంకు తరలించి కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

## బెల్ట్ షాపులపై సమాచారం ఇవ్వండి
### - గోప్యంగా ఉంచుతాం



**కోవూరు, డిసెంబరు29 ప్రభాతవార్త :** కోవూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఏ గ్రామంలోనైనా నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం బెల్ట్ షాపులు ఏర్పాటుచేస్తే ఆ సమాచారాన్ని తమ దృష్టికి తీసుకువస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరు గుతుందని కోవూరు ఎక్సైజ్ సీఐ కిషోర్ తెలిపారు.కోవూరులోని ఎక్సైజ్‌సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏ ప్రాంతంలో కూడా అనధికా రికంగా మద్యం బెల్ట్ షాపులు ఉండ డానికి వీలు లేదన్నారు. ఈ విధంగా ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే తగు సమాచారాన్ని 9440707018 అనే నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇప్పటివరకు సర్కిల్ పరిధిలో 12 మద్యం బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. 10మందిని తహసీ ల్దార్ ముందు బైండోవర్ కూడా చేయడం జరిగిందన్నారు. ఒకసారి అక్ర మంగా మద్యం అమ్ముతూ దొరికి, రెండవసారి కూడా అదే నేరం చేస్తే అటు వంటి వారు జైలుకు వెళ్లడం తప్ప దన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇటు వంటి అక్రమ వ్యాపారాన్ని మాను కోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## నైపుణ్య అభివృద్ధి శిక్షణపై అవగాహన సదస్సు ఆదనపు కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్,డిసెంబర్ 29,ప్రభాతవార్త** పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ - మెప్మా, నెల్లూరు జిల్లా లోని నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ రకములైన సేవలు అందించే వారు అనగా ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఎ సి,గీజర్,టీవీ, రిఫ్రిజిరేటర్ వాషింగ్ మిషన్ రిపేరు చేసే వారు,బ్యూటీషియన్ (మహిళలు ,పురుషులు) మొదలగు సేవలు అందించే వారందరికి నైపుణ్య అభివృద్ధి శిక్షణ NSDC, SDC, వితిదిల ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి హోమ్ ట్రయాంగిల్ ప్లాట్ ఫాం ద్వారా ఆన్ బోర్డు చేయించి వీరికి జీవనో పాధి కల్పించబడునని కార్పొరేషన్ అదనపు కమిషనర్ వై.ఓ నందన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పైన తెలిపిన సేవలు అందించే అర్హత , ఆసక్తి కలిగిన అభ్యర్థులు నగరపాలక సంస్థ లోని మెప్మా విభాగము నందు తేది. 28/12/2024 నుండి 04/01/2025 వరకు అర్హులైన అభ్యర్థులు వివరాలు నమోదు చేసుకోనవలసినదిగా నెల్లూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సూచించారు.దరఖాస్తుదారులు ఇందు వెంట ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్, ఫోటోలు 2 తీసుకొని హాజరు కావాల్సిందిగా తెలియచేయడమైనది.వివరములకు సంప్రదించవలసిన మొబైల్ నంబర్ .కవిత సి.ఎమ్.ఎమ్ 7901311583,జరీనా సి.ఎమ్.ఎమ్ 7901311569.

## స్ఫూర్తిదాయక రాజకీయ జీవితానందించిన మాదాల

- సమస్యల పరిష్కారానికి ఉద్యమ ఫందాలో సాగిన జీవితం
అనతి పదవీ కాలంతోనే శాశ్వత ముద్ర
- గ్రామ గ్రామాన అనుచరగణం - ఉదయగిరిపై చెరగని ముద్ర
- ఆశ ఊహలచే రాజకీయ అరంగేట్రం చేయించిన మాదాల



**ఉదయగిరి, డిసెంబర్ 29, ప్రభాతవార్త** ఆస్త్ర రాజకీయ వినీలాకాశంలో ఒక ధృవ తారగానిలిచారు.మాదాల జానకిరామ్ చిన తనం నుండి సమస్యల పరిష్కారానికి ఉద్యమ పందాలులో సాగిన ఆయన జీవి తం ఎంతో మందికి స్ఫూర్తిని మిగిల్చింది. విద్యార్థి దశలో ఆంధ్రసేన ఉద్యమ అధ్యక్షు నిగా ఆరంభమైన రాజకీయ ప్రస్థానం రాష్ట్ర మంత్రి స్థాయికి కేంద్ర మంత్రుల సత్సం బంధాల వరకు వెళ్లాయి. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన అద్భుతమైన వాగ్దాటి ఆకట్టుకునే ఆహార్యమే తన అస్త్రాలుగా ఎంచుకున్నారు. ముక్కు సూటి తనంతోనే రాజకీయాలు చేశారు. తప్పొప్పులు నిర్మొహమాటంగా కుండబద్దలు కొట్టే విలక్షణ వ్యక్తిత్వం ఆయన సొంతం తెలుగు, హిందీ, ఇగ్లీషు భాషల్లో మంచి పట్టున్న దిట్ట ఉదయగిరి నియోజ కవర్గానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోయాయి. ఉదయ గిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని తలంపును సృష్టించినది ఆయనే పర్యాటక కేంద్ర నినాదం రాష్ట్ర దేశ స్థాయిలో ప్రధాన చర్చనీయాంశంగా మారాయి. ఘనమైన చరిత్ర కలిగిన ఉదయగిరి పూర్వవైభవాన్ని తీసుకు వచ్చి ఘనపాటి అనిపించుకున్నారు. ఇంకా మరెన్నో మంచి పనులు చేశారు. ఉదయ గిరిలో 132 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు ఆర్టీసీ డిపో స్థాపన దుత్తలూరులో పాలశీత లికరణ కేంద్రం ఏర్పాటు నియోజ కవర్గంలో 25 వేల పక్కా గృహాల నిర్మాణం, అయ్యప్ప హాస్టల్ స్థాపించి ఎంతో మంది పిల్లలను చేరదీసి అన్నం పెట్టిన మహానుభావుడు ఆయన మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. నియోజకవర్గాన్ని పట్టిపీడిస్తున్న అన్ని సమస్యలు సమూలంగా అధ్యయనం చేసి వాటి పరిష్కార మార్గాలను చూపిన మేధావి నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా ఉదయగిరి ప్రాంతానికి సాగునీరు అందించవచ్చని పాలకుల దృష్టిని ఆ దిశగా మళ్లించారు. ప్రకాశం జిల్లా కురిసేదు నుండి కావలి వరకు 400 కిలోమీటర్ల మేర పాద యాత్ర చేసి ప్రజల్లో చైతన్యాన్ని నింపారు. సీతారాం సాగర్ ద్వారా మాత్రమే ఈ ప్రాంతం కరువుకు శాశ్వత పరిష్కారమని అనేక రూపాల్లో ఆయన డిమాండ్లు చేశారు. ప్రజలందరి డబ్బుతో ప్రభుత్వం ప్రాజెక్టును నిర్మించి నీటి తీరువాతో సాగునీరు ఇవ్వడం ఒక వైపు మెట్ట ప్రాంతాలలో అప్పులు చేసిపెట్టుబడి పెట్టి బోర్లు మోటార్లతో పండించిన పంటకు ఒకే ధర నిర్ణయించడం తీవ్రమైన అన్యాయమని నిరసన గలం వినిపించారు. సోమశిల హై లెవల్ కెనాల్ ద్వారా ఉదయగిరి ప్రాం తానికి సాగునీరు అందించవచ్చని ఎన్నో పర్యాయాలు పాలకుల దృష్టికి తీసుకెళ్లారు పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి చూపాలని అనేక ప్రయ త్నాలు చేశారు. నడికుడి రైల్వే లైన్‌పై అనేక దఫాలు తన గళాన్ని వినిపించాఉ. ఆధ్యాత్మిక చింతన కలిగిన వ్యక్తి శాఖాహారి అయ్యప్ప దీక్షాపరుడు జగన్మాత వెంగ మాంబ భక్తుడు ఈ ప్రాంతంలో ఎంతో మందిని అయ్యప్ప స్వామి దీక్ష వైపు నాకు ఆకర్షింపచేశారు. గతంలో శ్రీ వెంగమాంబ మాతల మాలను ఎంతో మంది చేత చేయించి విశిష్టతను తెలియజేశారు. తనదైన మార్కుతో ఎంతో మంది అను చరగనాన్ని డెవలప్ చేశారు. ప్రతి మండలంలో ఆశ ఊహలకు రాజకీయ శిక్షణ ఇచ్చి అరంగేట్రం చేయించారు. ప్రస్తుతం ప్రస్తుత ఎమ్మెల్యే మాట కూడా మాదాల నోటి నుండి వచ్చినదే ప్రజలు అనుకుంటున్నారు.

## ఆటోని ఢీకున్న మోటార్ బైకు





**సంగం డిసెంబర్ 29 ప్రభాతవార్త** సంగం మండలంలో తరుణవాయి సమీపంలో జాతీయ రహదారిపైన ఆటోను మోటార్ బైకు ఢీకున్న సంఘటనలో 6మందికి తీవ్రగాయాలు అయ్యాయి. దువ్వూరులో వరి నాట్లకోసం వెళ్ళి తిరిగి చెన్నవరపాడుకు వెళుతున్న ఆటోను వేగంగా వస్తున్న మోటార్‌బైకు ఢీకొట్టింది. ఆటో బోల్తా పడింది. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.ఈ సంఘటనలో తలమంచి మల్లీశ్వరి,తలమంచి శీనయ్య, కె.కొండయ్య, వాకాటి లక్ష్మయ్య, గుంజి బుజ్జమ్మ, ఊరుటూరు బుజ్జిమ్మలకు తీవ్రగాయాలు అయ్యాయి. వీరు ఆత్మకూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బంగారు పతకాలు సాధించిన శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్ విద్యార్థులు




**బుచ్చి డిసెంబర్ 29 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్ విద్యార్థులు చిత్రలేఖన పోటీలలో బంగారు పథకాలు సాదించారు. నెల్లూరు అమీర్ ఆర్ట్స్ అకాడమి వారు నిర్వహించిన పోటీలలో శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్ విద్యార్థులు ఏడు మందికి బంగారు పతకాలు సర్టిఫికేట్లు అందజేశారు. విద్యార్థులకు వారి అభిరుచిమేర ఏరంగంలో వారు ఇష్టపడతారో ఆ రంగంలో వారి ప్రోత్సహించాలని వారికి ఆరంగం పట్ల ఆసక్తి కలుగుతుందని పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్ ఈ సందర్భంగా తెలిపారు. బంగారు పథకాలను సాదించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు అమరావతి కృష్ణారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారని తెలిపారు.పాఠశాల ఉపాధ్యాయురాలు సురేకను సన్మానించారు.